

ఫెబెల్ సిటీలో 5కే రన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



సిరిమల్లె కాలనీలో పార్క్ క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, కమిషనర్

బండ్లగూడ: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఫెబెల్ సిటీ రెసిడెన్సీ ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. సిరిమల్లె కాలనీ పార్క్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రతో కలిసి మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, కాలనీవాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం పెద్ద పీట

రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ సిద్ధేశ్వర్



రాచమల్ల సిద్ధేశ్వర్

శంషాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి... పేదల పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచల్ల సిద్ధేశ్వర్ అన్నారు. విద్యారంగంలో సీఎం చేపట్టిన చేపట్టిన సంచలనాత్మక ఆవిష్కరణలు నచ్చకే బీఆర్‌ఎస్ నేతలు ఫుడ్‌పాయిజనింగ్ కుట్రకు తెరలేపారని ఆరోపించారు. డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న సర్కారును ఎలాగైనా అప్రదిష్టపాలు చేసేందుకు బీఆర్‌ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ సంక్షేమ హాస్టళ్లలో చేయిస్తున్న కుట్రలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పనిచేసి ఆర్.ఎస్.ప్రవీణ్ అప్పట్లో ఫుడ్ కాంట్రాక్టర్లు, వర్కర్లను నామినేట్ పద్ధతిలో నియమించడంతో ప్రస్తుతం వారు ఆయన నియంత్రణలోనే ఉన్నారని ధ్వజమెత్తారు. విద్యార్థుల్లో ఆత్మస్థైరాన్ని దెబ్బతీయడానికి చేస్తున ఈ తరహా నీచమైన కుట్రలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడా లోతైన దర్యాప్తు చేసి నిజాలను వెలికితీస్తుందన్నారు. రాజకీయాల కోసం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడటం బీఆర్‌ఎస్‌కు తగదన్నారు. బీఎస్పీ ఉన్న సమయంలో ఆర్.ఎస్.ప్రవీణ్ బీఆర్‌ఎస్‌ను దూషించి ఇప్పుడు వారి పంచన చేరి అప్పటి ప్రభుత్వాన్ని పొగడడం హాస్యాస్పందంగా ఉందన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా బోధించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చక్కటి బోధన చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని.. ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి సూచించారు. 'ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజేంద్రనగర్ మండల స్థాయిలోని 'పాఠశాల విద్యార్థులు – పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు దీటుగా చదివి మంచి ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. పోటీతత్వం ఉంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన మండల స్థాయి పాఠశాలల విద్యార్థులు బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థికి ప్రథమ బహుమతి, రాజేంద్రనగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థికి రెండవ బహుమతి, గణేష్ నగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థికి మూడవ బహుమతి అందజేశారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు, ఎంఈవో శంకర్ రాథోడ్, గణేష్ నగర్ హెచ్‌ఎం మాధవి, బుద్వేల్ హెచ్‌ఎం సుగుణ, అత్తాపూర్ హెచ్‌ఎం ఝాన్సీరాణీ, మైలార్‌దేవ్‌పల్లి హెచ్‌ఎం చంద్రశేఖర్, ఎంటీఆర్ నగర్ హెచ్‌ఎం సత్యనారాయణ రాజు, శివరాంపల్లి హెచ్‌ఎం కిషన్ నాయక్, ఉపాధ్యాయుడు మాణిక్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం

మణికొండ: ఆకలితో ఉన్న పేదలకు పట్టెడన్నం పెట్టి వారి ఆకలిని తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. ఆదివారం అమావాస్య సందర్భంగా అలకాపూర్ టౌన్‌షిప్ పరిధిలోని వారి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నెల అమావాస్య రోజు క్రమం తప్పకుండా తమ అసోసియేషన్ తరఫున అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాల నిర్వహణలో తమ సభ్యులు ముందుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



వీరభద్ర స్వామి ఆలయంలో...

మైలార్‌దేవ్‌పల్లి: కార్తీక మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా బాబుల్‌రెడ్డినగర్ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు, స్థానిక నేతలు ఎస్.వెంకటేష్, పోతురాజు మల్లేష్, నాగరాజు, శేఖర్, జగన్, రాజ్‌కుమార్, ప్రవీణ్, సన్ని తదతరులు పాల్గొన్నారు.



వీరభద్ర స్వామి ఆలయంలో...

బకాయిలు రూ. 5 కోట్లు.. వసూలైంది రూ. 35 లక్షలు..!

- శంషాబాద్ మున్సిపాలిటీలో 7 వేల నల్లాలు
- వన్ టైం సెటిల్‌మెంట్‌కు కొరవడిన స్పందన
- ఇంకా అరకొరగానే నీటి సరఫరా
- పూర్తయినా ప్రారంభించని ఓవర్‌హెడ్ ట్యాంక్
- పలు ప్రాంతాల్లో తప్పని నీటి కష్టాలు

శంషాబాద్: మెట్రోవాటర్ బోర్డుకు రాయితీ ప్రకటనలకు శంషాబాద్‌వాసులు ఏ మాత్రం స్పందించలేదు. బకాయిలు ఉన్న నీటి బిల్లులకు వన్ టైం సెటిల్‌మెంట్ ప్రకటించినా ప్రతిస్పందన లేదు. రూ. కోట్లలో పేరుకుపోయిన నల్లా బిల్లుల చెల్లింపులో శంషాబాద్ వినియోగదారులు చెల్లించింది పది శాతం లోపే.

స్పందన అంతంతమాత్రమే...

పట్టణంలో మొత్తం 7 వేల నల్లా కనెక్షన్ల నుంచి మొత్తం రూ. 5 కోట్ల నీటి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల మెట్రోవాటర్ బోర్డు వన్ టైం సెటిల్ మెంట్‌ను ప్రకటించిన తొలుత నిర్ణయించిన గడువు పూర్తయిన తర్వాత నవంబర్ 30 వరకు నీటి బిల్లుల బకాయిల్లో ఉన్న వడ్డీని రద్దు చేసేందుకు అవకాశం కల్పించింది. అయితే 7 వేల మంది వినియోగదారుల్లో కేవలం వేయిమంది వినియోగదారులు మాత్రమే వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ. 35 లక్షల మేర బిల్లులను క్లియర్ చేశారు. మరో రూ. 4.65 కోట్ల నల్లా బిల్లులు యథావిధిగానే ఉన్నాయి.



హుడాకాలనీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

ఎందుకిలా...

పట్టణంలో ఔటర్ రింగు రోడ్డు లోపలి భాగంలో మొత్తం 7 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. కనెక్షన్ల సంఖ్య ఆధారంగా నిత్యం ఐదు మిలియన్ లీటర్ల నీటి సరఫరా చేయాల్సి ఉన్నా మెట్రోవాటర్ బోర్డు రోజూ నాలుగు మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తోంది. పట్టణంలోని హుడా కాలనీలో రెండు మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకును నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉంచినా వివిధ కారణాలతో దాని ప్రారంభం కాస్తా వాయిదా పడుతూ వస్తోంది. దీంతో పట్టణంలోని నీటి కనెక్షన్లకు అవసరమైన నీటి సరఫరా జరగడం లేదంటూ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఐదేళ్లుగా మెట్రోవాటర్ బోర్డు ఆధీనంలో నీటి సరఫరా జరుగుతున్నా ఇంకా పూర్తి స్థాయిలో మెరుగైన సరఫరా లేక పోవడంతో వినియోగదారులు బిల్లులు చెల్లించే విషయంలో పూర్తిగా స్పందించడం లేదనే అభిప్రాయాలూ లేకపోలేదు.

పూర్తిగా స్పందించలేదు...

వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వడ్డీ రాయితీ ప్రకటించినప్పటికీ వినియోగదారులు పూర్తిగా స్పందించడం లేదు. ఏడువేల నీటి కనెక్షన్లు ఉండగా వేయి మంది మాత్రమే బిల్లులు క్లియర్ చేశారు. హుడా కాలనీలో సిద్ధమైన రెండు మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు సిద్ధమైంది. త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలో మరింత మెరుగైన నీటి సరఫరా జరుగుతుంది.

– హసీనా, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్

ఎమ్మెల్యేతో బృందావన్ కాలనీ కమిటీ భేటీ



రాజేంద్రనగర్: బృందావన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు పెండ్యాల సాయి మల్లిక్ (శ్రీనివాస సేవా సమితి చైర్మన్) ఆధ్వర్యంలో కొత్త కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధి గురించి తెలియజేశారు. నూతన అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గోల్కొండ: ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాల సందర్భంగా ఆదివారం గోల్కొండ మండలానికి చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండ ముఫీద్ ఉన్ నిస్సాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు జరిగాయి. గోల్కొండ డిప్యూటీ ఐవోఎస్ మక్బూల్ అహ్మద్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సయ్యద్ జాకేర్ హుస్సేన్, విజయ్‌ల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లు అప్పగింత

గోల్కొండ: చోరీలు చేసే వారి ఎత్తులకు పైఎత్తులు వేసి వారిని పట్టుకుంటున్నామని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనానికి గురైన 24 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని వాటిని బాధితులకు అందిస్తున్నామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను గుర్తిస్తున్నామన్నారు. తెలంగాణ పోలీసులకు ఎన్నో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఘరానా దొంగలతో పాటు హైటెక్ దొంగలను సైతం పట్టుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, డీఎస్‌ఐ రఫీయుద్దీన్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గం: గుల్‌మోహర్ పార్కు కాలనీ డబుల్ ఇళ్లవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గుల్‌మొహర్ పార్కు కాలనీవాసులు ఆదివారం ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన్ని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ డబుల్ ఇళ్లలో నివాసముండే వారికి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, సొసైటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నదని మండల విద్యాధికారి కె.విజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన–ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తుంది. ఈ వారోత్సవాలలో భాగంగా తొలి రోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసింది. హైదర్షాకోట్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో నార్సింగి పాఠశాల నుంచి 20 మంది, కోకాపేట్ పాఠశాల నుంచి 8 మంది, హైదర్షాకోట్ పాఠశాల నుంచి 17 మంది, మణికొండ పాఠశాల నుంచి 28 మంది, కేజీబీవీ కిస్మత్‌పూర్ పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహించిన ఈ వ్యాస రచన పోటీల్లో మొత్తం 121 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్రల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైదర్షాకోట్ ప్రధానోపాధ్యాయుడు సైదిరెడ్డి, వట్టినాగులపల్లి ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, మణికొండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, ఎంపీహెచ్‌ఎస్ కోకాపేట్ ఇన్‌చార్జీ ఉపాధ్యాయులు భూపాల్‌రెడ్డి, కేజీబీవీ కిస్మత్‌పూర్ స్పెషల్ ఆఫీసర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

సీపీఐ నేత బాలమల్లేష్ సేవలు చిరస్మరణీయం



బాలమల్లేష్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, వ్యవసాయ రంగ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలమల్లేష్‌కు ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు. బాల మల్లేష్ మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లో ఏఐటీయూసీ, సీపీఐ సీనియర్ నాయకుడు బండి నరసింహ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల మల్లేష్ ఒక రాజకీయ నాయకుడు గాక యువకులను ఎంతో ప్రోత్సహించేవారన్నారు. అలాంటి వ్యక్తి ఆకస్మాత్తుగా మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు జె.ఆనంద్‌గౌడ్, రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె.విజయానందం గౌడ్, జె.సదానందం గౌడ్, మహేశ్, సాయి కిరణ్, వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో...

బుద్వేల్‌లోని సీపీఐ కార్యాలయంలో ఎస్.బాల మల్లేష్ సంతాప సభను నిర్వహించారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ కంట్రోల్ కమిషన్ పుస్తకాల నర్సింగ్ రావు, సీనియర్ నాయకులు సయ్యద్ అఫ్సర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.ఎ.రియాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి విజయానంద్ గౌడ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి టి.ఆనంద్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆనంద్ గౌడ్, ఆఫీస్ సెక్రటరీ ఎస్.సత్యం, సీనియర్ నాయకులు శంకరయ్య, బాబురావు, ఎ.రాజు, సాయిలు, నరసింహ, శ్రీకాంత్, కార్మికులు పాల్గొన్నారు.

సహజ ప్రసవాలతోనే మేలు



ర్యాంప్‌వాక్‌లో పాల్గొన్న గర్భిణి



కుమారుడితోపాటు తల్లి

మణికొండ: సహజ ప్రసవాలతో మాతా, శిశువుల ఆరోగ్యం ఎంతో బాగుంటుందని, గర్భధారణతో పాటు ప్రసవం సైతం సహజంగానే జరిగే ప్రక్రియ అని కిమ్స్ కెడల్స్ ఆస్పత్రి గైనకాలజీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కె.శిల్పిరెడ్డి అన్నారు. సహజ ప్రసవాలపై అవగాహనకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచారంలో భాగంగా మిసెస్ మామ్ ఎనిమిదవ ఎడిషన్‌ను ఆదివారం రాత్రి పుప్పాలగూడలోని ది లీగ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా పలు నగరాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సహజ ప్రసవాలు, కుటుంబ సభ్యుల మద్దతు, గర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహార ప్రాధాన్యం, వ్యాయామాలు, భర్త మద్దతు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులగురించి వివరించారు. గర్భధారణ, ప్రసవాల గురించి అపోహలతో చాలా మంది సిజేరియన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. హైదరాబాద్‌లో తమకు 500కు పైగా రిజిస్ట్రేషన్లు వచ్చాయని వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కిమ్స్ ఆస్పత్రులు సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, సీఈఓ డాక్టర్ అభినయ్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు ర్యాంప్‌వాక్ తదితర పోటీలను నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



కార్తీక పూజల్లో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో కార్తీక మాసం చివరి ఆదివారం పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అభిషేకం, ఆకాశ దీపం వెలిగించి అనంతరం ఉమామహేశ్వరి దేవిరి హారతి సమర్పించారు. పూజల్లో నారగూడెం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



హైదర్‌గూడలో సిబ్బందికి సూచనలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

అత్తాపూర్: ప్రధాన రహదారులపై తరచు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ వెల్లడించారు. పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్ 134, పిల్లర్ నెంబర్ 258 తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్‌తో కలిసి ఆయన పర్యటించారు. అలాగే పాత అజీజ్‌నగర్ గ్రామం గేటు మొయినాబాద్ వద్ద ప్రమాద స్థలాన్ని సందర్శించి ట్రాఫిక్ జామ్ కాకుండా జేసీబీ సాయంతో రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అధికంగా జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సింహ గర్జన సభకు తరలిన మాలలు



అంబేడ్కర్ చౌరస్తా నుంచి వెళ్తున్న నేయకులు

రాజేంద్రనగర్: మాలల సింహ గర్జన సభకు ఆదివారం రాజేంద్రనగర్ నుంచి పెద్ద ఎత్తున మాలలు తరలివెళ్లారు. రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా సభ స్థాయికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకుడు పంబల రాజు మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి మాల గడప నుంచి సభకు తరలిరావడం అభినందనీయమన్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా మాలలంతా కలిసి కట్టుగా ర్యాలీకి రావడం శుభ సూచకమన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల అందజేత

రాజేంద్రనగర్: ప్రజాపాలన సంబరాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో దివ్యాంగులకు వీల్ చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్‌లకు చెందిన 17 మంది దివ్యాంగులకు ఈ వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీ–బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖలీద్, రాజేంద్రనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడు ధనుంజయ్, పలుగు చెరువు మహేశ్, ఉప కమిషనర్ రవి కుమార్, వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్, ప్రధాన కార్యదర్శి సిద్ధప్ప, రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు ముద్దగౌని భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో నాగాలాండ్ ఫౌండేషన్ డే

తరలిన హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, విద్యార్థులు



కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, విద్యార్థులు, ఫ్యాకల్టీ

రాయదుర్గం: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నాయకత్వంలో రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన నాగాలాండ్ ఫౌండేషన్ డే కార్యక్రమంలో హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి నాగాలాండ్‌కు చెందిన విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు తరలివెళ్లారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఏక్‌భారత్– శ్రేష్ఠభారత్ (ఈబీఎస్‌బీ) పేరిట కేంద్ర ప్రభుత్వం, రాజ్‌భవన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. హెచ్‌సీయూ ఈబీఎస్‌బీ కోఆర్డినేటర్ డాక్టర్ వి వంశీకృష్ణారెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ వేనుసాటినియా, డాక్టర్ అలిబాఓ, డాక్టర్ లిమాకుంబావాల్లింగ, డాక్టర్ రెలో కెన్యే, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం

గోల్కొండ: సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ..పేదింటి అమ్మాయిల పెళ్లి కోసం కల్యాణలక్ష్మి పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ పథకాలే కాకుండా నిరుపేదలకు ఇంకా ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయన్నారు. అర్హులైన వారు సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి మీసేవా కేంద్రాల్లో అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అలీముద్దీన్, అబీబ్‌చౌస్, మజీద్‌ఖాన్ తదితరులున్నారు.